ఏదీ జలకళ?

పొలంలో బోరు తవ్వి విద్యుత్ కనెక్షన్, వ్యవసాయ మోటారు ఉచితంగా ఇస్తామని వైసీపీ సర్కారు ప్రకటన

- వైఎస్సార్ జలకళ పథకం పేరిట ప్రచార ఆర్భాటం
- ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఐదేళ్లలో 20 వేల బోర్లు వేస్తామని చెప్పి ఏడు వేలకు కుదింపు
- విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై వెనకడుగు
- కేవలం 397 బోర్లు వేసి చేతులు దులుపుకున్న వైనం
- నిరాశ చెందిన రైతులు


వైఎస్సార్ జలకళ పథకం రిగ్‌లు

చోడవరం, ఏప్రిల్ 9:
'అన్నదాతలకు అండగా ఉంటాం. రైతుకు పొలంలో బోరు తవ్వి విద్యుత్ కనెక్షన్, వ్యవసాయ మోటారు ఉచితంగా అందిస్తాం'... ఇదీ వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పేరుతో చేసిన హడావిడి. ఉమ్మడి జిల్లాలోని విశాఖ నగరం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఏడాదికి 500 చొప్పున ఐదేళ్లలో 2,500 మంది రైతులకు ఉచితంగా బోరు తవ్వి, విద్యుత్, మోటారు సరఫరా చేస్తామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కాగా ఈ ఐదేళ్లలో ఎనిమిది నియోజకవర్గాల్లో 20 వేల బోర్లు వేస్తామని చెప్పి ఏడు వేలకు కుదించింది. అయినా కేవలం 397 మాత్రమే వేసిందంటే ఈ పథకం ఏ మేరకు విజయవంతం అయ్యిందో అర్థం చేసుకోవచ్చు.

వైఎస్సార్ జలకళ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని విశాఖ నగరంలోని నియోజకవర్గాలు మినహాయించి మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఏడాదికి 500 బోర్లు చొప్పున ఐదేళ్లలో 2,500 వేల బోర్లు వేయాలి. అంటే ఎనిమిది నియోజకవర్గాలకు ఐదేళ్లలో 20 వేల బోర్లు వేసి వాటికి వ్యవసాయ మోటార్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పథకం అమలులో వైఎస్సార్ జలకళ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ అధికారులు చెప్పిన మాట ఇదే. కానీ పథకం అమలు ప్రారంభం అయ్యేసరికి ఏడాదికి 500 బోర్లు కాస్త 175కి మారిపోయింది. అంటే ఐదేళ్లలో నియోజకవర్గానికి 875 బోర్లు వేయాలన్న మాట. ఈ లెక్కన చూసినా ఐదేళ్లలో 8 నియోజకవర్గాల్లో ఏడు వేల బోర్లు తవ్వాలి. అయితే ఈ ఐదేళ్లలో జిల్లాలోని 8 నియోజకవర్గాలలో రెండు విడతల్లో వేసిన బోర్ల సంఖ్య కేవలం 397 మాత్రమే. ఈ లెక్కను బట్టి చూస్తే వైఎస్సార్ జలకళ పథకంపై ఆశ పెట్టుకున్న రైతులు ఎంత వంచనకు గురయ్యారో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో జలకళ పథకం కింద 8,724 మంది రైతులు దరఖాస్తులు చేసుకుంటే, ఇందులో 1,554 మంది రైతుల పొలాల్లో జియాలజిస్టుల సర్వేలు నిర్వహించి వివరాలు అప్‌లోడ్ చేస్తే చివరకు 678 బోర్లకు అనుమతి వచ్చింది. చివరకు కాంట్రాక్టర్లు వేసిన బోర్లు 397 మాత్రమే.

వాహనాలు కాంట్రాక్టర్లవి.. ప్రచారం ప్రభుత్వానిది

వాస్తవానికి జలకళ పథకం ప్రారంభించిన సమయంలో వైసీపీ ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ప్రతి నియోజకవర్గానికి ఒక రిగ్ కేటాయించినట్టు ప్రభుత్వం ప్రకటించి హడావిడి చేసింది. ఈ రిగ్‌లతో ఆయా నియోజకవర్గాల్లోని రైతులకు ఉచితంగా బోర్లు తవ్విస్తామంటూ ప్రచారం చేసింది. వాస్తవానికి ఈ రిగ్‌లన్నీ కాంట్రాక్టర్లవే. కాంట్రాక్టర్ల రిగ్‌లకు రంగులు వేసి మరీ వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుని నియోజకవర్గాల్లో హడావిడి చేసింది. రిగ్ యజమానులకు ఏడాదికి 500 బోర్లు వేయాలని చెప్పి తరువాత 175 బోర్లుకు లక్ష్యాన్ని కుదించి పనులు అప్పగించింది. ఈ పథకం అమలులో తొలుత ఆసక్తి చూపించిన రిగ్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో చాలామంది డీలాపడిపోయారు. ఇదే సమయంలో జిల్లాలోని డ్వామా అధికారులు నుంచి ఎదురైన సహాయ నిరాకరణ కూడా వారిని వెనక్కి లాగిందన్న విమర్శలు ఉన్నాయి.

రైతుల్లో నిరాశ

జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు వైఎస్సార్ జలకళ బోర్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. విద్యుత్ కనెక్షన్ భారం కూడా తమదేనన్న ప్రభుత్వం తరువాత విద్యుత్ కనెక్షన్లకు ఖర్చు ఎక్కువ అవుతుండడంతో ఆదిలోనే నాలిక మడతేసింది. విద్యుత్ కనెక్షన్ భారం రైతు భరించాలని, కేవలం తాము బోరు తవ్వి, మోటారు మాత్రమే ఇస్తామంటూ మెలిక పెట్టింది. అయినప్పటికీ చాలామంది రైతులు తాము విద్యుత్ కనెక్షన్ వేసుకుంటామని, బోరు తవ్వించాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పథకంపై ప్రారంభంలో హడావిడి చేసిన ప్రభుత్వం తరువాత అటు రైతులకు, ఇటు కాంట్రాక్టర్లకు కూడా చుక్కలు చూపించడంతో ఇది కేవలం ప్రచారానికే పరిమితమైంది. దీనికి తోడు దరఖాస్తు చేసింది మొదలు వీఆర్వోల సర్వేలు, జియాలజిస్టుల సర్వేలు, అప్‌లోడింగ్, ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావడం వంటి పనుల్లో విపరీతమైన జాప్యం చోటుచేసుకోవడంతో చాలామంది రైతులు నీరుగారిపోయారు. జిల్లాలో దాదాపుగా 1,191 మంది రైతుల పొలాల్లో జియాలజిస్టులతో రిగ్ కాంట్రాక్టర్లు సొంత ఖర్చులతో సర్వే చేయించి రిపోర్టులు అప్‌లోడ్ చేయిస్తే, వాటికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. కాగా బోర్లు తవ్విన చోట మోటార్లు ఇవ్వకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతులకు నిరాశే మిగిలింది



వైఎస్సార్ జలకళ పథకం కింద రైతుల పంట పొలాల్లో ఉచితంగా బోర్లు వస్తాయని అంతా ఆశతో దరఖాస్తులు చేశారు. కానీ వారందరికీ నిరాశే మిగిలింది. దరఖాస్తు చేసిన రైతులు అధికారులను అడితే ఇదిగో, అదిగో అంటూ తిప్పించుకున్నారు తప్పితే బోర్లు మాత్రం మంజూరు చేయలేదు.

- పైలా ముత్యాలనాయుడు, రైతు సంఘం నాయకుడు, జైతవరం, చీడికాడ మండలం

సర్వేలు చేసి వెళ్లారంతే..



వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు ఇస్తామంటే దరఖాస్తు చేశాను. వీఆర్వో సర్వే చేశారు. తరువాత జియాలజిస్టు వచ్చి సర్వే చేశారు. ఆ తరువాత నుంచి ఎలాంటి సమాచారం లేదు. అధికారులను అడిగినా ఫలితం లేకుండాపోయింది.

- గొర్లె మహలక్ష్మినాయుడు, రైతు, నాగయ్యపేట, దేవరాపల్లి మండలం

ఎలాంటి స్పందన లేదు



వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు ఇస్తామంటే దరఖాస్తు చేశాను. తరువాత నుంచి ఎలాంటి స్పందన లేదు. అధికారులను అడిగినా సమాధానం ఇవ్వలేదు. బోరు వస్తుందని చాలా సంబరపడ్డా. కానీ నిరాశే మిగిలింది.

- పల్లికల దేముడు, రైతు, పొంగలిపాక, మాడుగుల మండలం

ఘనంగా ఉగాది వేడుకలు


ఉగాది సందర్భంగా పుష్పాలంకరణలో చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు

ఘనంగా ఉగాది వేడుకలుజిల్లాలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది సందర్భంగా చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో విఘ్నేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. - చోడవరం

అనకాపల్లి @ 39.1°


జనసందడి లేని అనకాపల్లిలోని చోడవరం బస్టాప్ రోడ్డు

- మండుతున్న ఎండలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9: అనకాపల్లిలో ఎండలు మండుతున్నాయి. మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రత 39.1 డిగ్రీలు గాను, అత్యల్ప ఉష్ణోగ్రత 25.0 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఆదివారం 38.8 డిగ్రీలు ఉండగా, సోమవారం ఉష్ణోగ్రత 34.8 డిగ్రీలకు తగ్గింది. మంగళవారం ఒక్కసారిగా 39.1 డిగ్రీలకు పెరగడంతో పాటు వడగాడ్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వాహనచోదకులు వడగాడ్పుల కారణంగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. వాణిజ్య కేంద్రమైన అనకాపల్లికి ఉగాది పండగ సందర్భంగా పలు వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఈ ఉష్ణోగ్రతలకు అల్లాడిపోయారు. పలు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు చల్లటి మజ్జిగను పంపిణీ చేశాయి. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఉపశమనం పొందారు.

రోడ్డంతా బూడిదమయం

లంకెలపాలెం రహదారిలో ఫ్లైయాష్ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

- బూడిద ఎగసి కళ్లల్లో పడుతుండడంతో ద్విచక్ర వాహన చోదకుల అవస్థలు
- పలు గ్రామాల ప్రజలు ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం


అసకపల్లి- లంకెలపాలెం రోడ్డులో భారీ వాహనాల రాకపోకల వల్ల ఎగసిపడుతున్న బూడిద

సబ్బవరం, ఏప్రిల్ 9: మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. నిత్యం వందలాది ఫ్లైయాష్ లోడులతో వాహనాలు రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. దీనికి తోడు ఫ్లైయాష్ రోడ్డుపై పడుతుండడంతో గాలికి ఎగసి కళ్లల్లో పడుతుండడంతో ద్విచక్ర వాహనాలు అవస్థలు పడుతున్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రోడ్డులో సుమారు 40 నుంచి 50 టన్నుల లోడుతో టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి వల్ల రోడ్డు ధ్వంసం కావడమే కాకుండా ఫ్లైయాష్ రోడ్డుపై పడుతుండడంతో గాలికి ఎగసి పడుతోంది. రోడ్డును ఆనుకొని ఉన్న అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పాలెం కాలనీ, పైడివాడఅగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాలతో పాటు లంకెలపాలెం వెళ్లే వరకు ఉన్న గ్రామాల్లో బూడిద గాల్లో ఎగసి పడుతుండడంతో ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలు, తాగునీరు కలుషితం అవుతోందని మహిళలు వాపోతున్నారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్లు, మాంసం దుకాణాల్లోకి బూడిద చేరి వ్యాపారులు నష్టపోతున్నారు.

ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం

ఫ్లైయాష్ డంపర్లు, లారీల రాకపోకలను అరికట్టాలని లంకెలపాలెం నుంచి అసకపల్లి వరకు ఉన్న గ్రామాల ప్రజలు అనేక సార్లు ధర్నాలు, ఆందోళనలు చేశారు. కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఫ్లైయాష్ రవాణా చేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఉద్యమిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

అధికారులు ఇక్కడికి వస్తే మా కష్టాలు తెలుస్తాయి



ఫ్లైయాష్‌తో భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. బూడిద రోడ్డుపై పడుతుండడం వల్ల ప్రయాణించడం కష్టంగా ఉంది. అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా, ఆందోళనలు చేసినా పట్టిం చుకోవడం లేదు. ఈ మార్గంలో అధికారులు ఒకసారి ప్రయాణిస్తే మా కష్టాలు తెలుస్తాయి.

- గొంతిన పైడిరాజు, పైడివాడఅగ్రహారం, సబ్బవరం మండలం

నెరవేరని సొంతింటి కల

టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

- గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణానికి 2,03,438 మంది అర్హులు గుర్తింపు
- 43,844 మంది డీడీలు సమర్పణ
- 55 వేల ఇళ్ల నిర్మాణానికి నగరం, చుట్టుపక్కల భూ సేకరణ
- 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- ఎన్నికల ముందు 4,000 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయింపు
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు
- డీడీలు సమర్పించిన వారిలో 30,083 మంది మాత్రమే అర్హులంటూ వాదన
- ఐదేళ్లలో ఇళ్ల పనుల్లో పురోగతి శూన్యం
- అదిగో...ఇదిగో అంటూ లబ్ధిదారులకు ఆశలు
- ఏడెనిమిది నెలల క్రితం 7,456 ఇళ్లు అప్పగింత
- అందులో సగానికిపైగా గత ప్రభుత్వంలో నిర్మించినవే...
- మిగిలిన లేఅవుట్లలో ఎక్కడి పనులు అక్కడే


బక్కన్నపాలెంలోని టిడ్కో ఇళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 24,192 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించగా...వైసీపీ కేవలం 7,456 ఇళ్లను (అవి కూడా గత ప్రభుత్వ హయాంలోనే దాదాపు పూర్తయ్యాయి) మాత్రమే లబ్ధిదారులకు అప్పగించింది. అయితే అక్కడ కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించకపోవడంతో ఖాళీగానే ఉండిపోయాయి.

మొత్తం లేఅవుట్‌లు	31
నిర్మాణం ప్రారంభించిన ఇళ్లు	24,192
ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందజేసినవి	7,456
లబ్ధిదారులు దిగిన ఇళ్లు	4వేలు లోపే

పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇళ్లను అందజేసేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస యోజన పథకానికి నోడల్ సంస్థగా టిడ్కో కార్యకలాపాలు సాగిస్తోంది. టిడ్కో ఇళ్ల కోసం జీవీఎంసీకి 3,47,284 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన తర్వాత 2,03,438 మందిని అర్హులుగా గుర్తించారు. అందులో ఇళ్ల ... మిగతా 8వ పేజీలో

ప్రారంభించారు.. వసతులు మరిచారు

అనకాపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అనకాపల్లి జోనల్ పరిధిలోని సత్యనారాయణపురంలో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. అయితే వసతుల కల్పన విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపింది. నాలుగేళ్లుగా లబ్ధిదారులు తమ ఇళ్లను అప్పగించాలని కోరినా స్పందించని వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎట్టకేలకు ఈ ఏడాది జనవరి 4న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. సత్యనారాయణపురంలో నిర్మించిన 2,250 ఫ్లాట్‌లను లబ్ధిదారులకు అప్పగించారు. కాలనీలో అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతులు కల్పించకుండానే ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేశారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించి మూడు నెలలు కావస్తున్నా, ఇప్పటికీ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు లేవు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు అందని కారణంగా అన్ని బ్లాకులకు తాగునీరు సరఫరా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొప్పాక, రాజుపాలెం, వల్లూరు లబ్ధిదారుల కోసం సిరసపల్లిలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో అధిక సంఖ్యలో ఇళ్లు విశాఖపట్నానికి చెందిన లబ్ధిదారులకు అందించారంటూ కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో మూడు బ్లాకుల్లో ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తయిన 1,024 టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవాలకు బ్రేకులు పడ్డాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ) 6.16

కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా విడుదల

- ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ, ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థిగా వేగి వెంకటేశ్
- విశాఖ ఎంపీ స్థానానికి పులుసు సత్యనారాయణరెడ్డి


వేగి వెంకటేష్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం రాత్రి విడుదల చేసింది. ఈ జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన రెండు లోక్‌సభ, ఐదు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పులుసు సత్యనారాయణ రెడ్డి, అనకాపల్లి లోక్‌సభ స్థానానికి వేగి వెంకటేష్ అభ్యర్థిత్వాలను పార్టీ ఖరారు చేసింది. అలాగే, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గానికి అడ్డాల వెంకట వర్మరాజు, విశాఖ సౌత్ నుంచి వాసుపల్లి సంతోష్, గాజువాక నుంచి లక్కరాజు రామారావు, అరకు లోయ నియోజక వర్గం నుంచి శెట్టి గంగాధర స్వామి, నర్సీపట్నం నుంచి రుత్తల శ్రీరామ్మూర్తి అభ్యర్థిత్వాలను పార్టీ ఖరారు చేసింది. రెండు దశల్లో రెండు పార్లమెంట్, 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మరో లోక్‌సభ (అరకు లోయ) స్థానంతో పాటు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

వైసీపీకి షాక్

- బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌తో పాటు టీడీపీలో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు
- అదేబాటలో మరో ఐదుగురు కార్పొరేటర్లు
- వైసీపీకి భీమిలి ఎంపీపీ రాజీనామా


సీతంరాజు సుధాకర్‌కు పార్టీ కండువా వేస్తున్న చంద్రబాబు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు కార్పొరేటర్లు షాక్ ఇచ్చారు. రాష్ట్ర ... మిగతా 8వ పేజీలో

సీఎం రమేశ్, అయ్యన్నలకు నోటీసులు

నర్సీపట్నం, ఏప్రిల్ 9: ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించారంటూ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడులకు నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరామ్ నోటీసులు జారీచేశారు. ఈ నెల ఆరో తేదీన స్థానిక కృష్ణా ప్యాలెస్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమంలో మహిళలకు చీరలు, డబ్బులు పంచుతున్నారని అందిన సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. అధికారుల తీరుపై సీఎం రమేశ్, అయ్యన్నపాత్రుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి ఇరువురి నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీచేశారు.

క్రైం... crime news

దండిసురవరంలో రెండు పూరిళ్లు దగ్ధం

» విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం



దగ్ధమైన పూరిళ్లు



దగ్ధమైన నగదు

చీడికాడ, ఏప్రిల్ 9: మండలంలోని దండిసురవరంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వివరాలివి.. గ్రామంలో గండెం వెంకటసూరి అ ప్పారావు, బత్తిలి గంగరాజు గృహాలు పక్కపక్కనే ఉన్నాయి. సోమవారం రాత్రి భోజనాలు ము గించుకుని కుటుంబాల సభ్యులు నిద్రపోయారు. తెల్లవారితే మంగళవారం వేకువజామున సుమారు 3.30 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా అగ్నిమంటలు ఎగసిపడ్డాయి. దీంతో నిద్రనుంచి తేరుకొని ఇళ్లలో ఉన్న వారు బయటకు వచ్చేశారు. క్షణాల్లో మంటలు వ్యాపించి రెండు పూరిళ్లు కాలిబూడిదయ్యాయి.

బూడిదగా మారిన నగదు, బంగారం, తిండిగింజలు

బాధితుడు కల్లుగీత కార్మికుడు గండెం వెంకటసూరి అప్పారావు. తన కుమార్తె పెళ్లి అవసరాలకోసం ఇంట్లో రూ.2 లక్షల నగదు దాచి ఉంచారు. ఈ నగదుతోపాటు ఆరు తులాల బంగారం నష్టపోయారు. బత్తిలి గంగరాజుకు చెందిన రూ.75 వేలు నగదు కాలిబూడిదైంది. వీటితో పాటు టన్ను ధాన్యం, రెండు కట్టల మినుములు, చిన్నారుల పుస్తకాలు, టీవీ, ట్యూబ్‌లు, మంచాలు, దుస్తులన్నీ మంటల్లో కాలిపోవడంతో బాధిత కుటుంబాలు ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. గ్రామస్థుల సమాచారం మేరకు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. స్థానిక సర్పంచ్ కోన అర్జున సమాచారంపై ఆర్ఐ కృష్ణంరాజు, వీఆర్‌వో పూడి ఈశ్వరరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ ఘటనలో రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు అంచనా.

దేవరాపల్లిలో పూరిల్లు..



కాలిపోయిన ఇంటి వద్ద బాధిత శేషారావు కుటుంబం

దేవరాపల్లి, ఏప్రిల్ 9: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో జల్లూరు శేషారావు అనే వ్యక్తికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. బాధితుడికి చెందిన రూ. 50వేల నగదుతోపాటు ఇతర సామగ్రి కాలి బూడిదైంది. ఈ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న గుల్లిపల్లి మురళికి చెందిన పది సోలార్ ప్యానల్స్, గుల్లిపల్లి సన్యాసినాయుడుకు చెందిన నాలుగు సోలార్‌ప్యానల్స్ దగ్ధమయ్యాయి. సుమారు రూ.6 లక్షలు ఆస్తి నష్టవాటిల్లినట్టు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న వీఆర్వో నాగేశ్వరరావు నష్టాన్ని అంచనా వేశారు.

బంగారమ్మపాలెంలో రెండు..

ఎస్.రాయవరం, ఏప్రిల్ 9: మండలంలోని బంగారమ్మపాలెంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమైనట్టు వీఆర్‌వో మురళి తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఉమ్మడి కాశి పూరిల్లు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు కాలిపోవడమే కాకుండా పక్కనే ఉన్న చోడిపల్లి రాజమ్మకు చెందిన మరో ఇంటికి మంటలు వ్యాప్తి చెందాయి. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్లు ఆహుతయ్యాయి. స్థానికులుమంటలను అదుపు చేయడానికి ప్రయత్నించడమే కాకుండా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన రెండు పూరిళ్లను వీఆర్‌వో పరిశీలించారు. సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని వీఆర్‌వో మురళి తెలిపారు. ఇదిలావుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు అంటున్నారు.

పది ఎకరాల్లో సరుగుడు, నీలగిరి తోటలు దగ్ధం



లైపురంలో దగ్ధమవుతున్న సరుగుడు తోట

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 9: మండల పరిధి లైపురంలో గుర్తు తెలియని వ్యక్తి కాల్చిపారేసిన సిగరెట్ వల్ల సంభవించిన అగ్ని ప్రమాదంలో పది ఎకరాల సరుగుడు, నీలగిరి తోటలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలివి.. సీతా రమణేశ్వరరావు, ఎర్రినాయుడు, దేగల రమణ, గంగరాజు, నూకరత్నం, ముచ్చకర్ల సత్యవతి, అచ్చింనాయుడు, సీతా ఎర్రినాయుడు, ఉల్లింగల అప్పారావు, నూకరాజులకు చెందిన ఎనిమిది ఎకరాల్లో సరుగుడు, రెండు ఎకరాల్లో నీలగిరి తోటలు ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ తోటలను వ్యవసాయ అధికారి భాస్కరరావు పరిశీలించి, పంట నష్టాన్ని సేకరించారు. బాధిత రైతులను ఆదుకోవాలని సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను ఏటను ఈ సందర్భంగా కోరారు.

19 మద్యం సీసాలు పట్టివేత

ఎలమంచిలి, ఏప్రిల్ 9: స్థానిక బస్టాండ్ వద్ద మంగళవారం కశింకోట మండలం నరసింగబిల్లి గ్రామానికి చెందిన చిందడ దొరబాబు వద్ద 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

900 లీటర్ల బెల్లపు పులుసు ధ్వంసం



గొంపలో బెల్లపు పులుసును ధ్వంసం చేస్తున్న పోలీసులు

రావికమతం, ఏప్రిల్ 9: మండలంలోని గొంపలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల బెల్లపు పులుసును ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలసి మంగళవారం తనిఖీలు నిర్వహించగా గ్రామ శివారు తోటల్లో భద్రపరిచిన ఐదు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో బెల్లపు పులుసును గుర్తించి, ధ్వంసం చేశామన్నారు. నిందితులు పరారయ్యారన్నారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 9 : మండలంలోని తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన చింతకాయల మహేష్ మంగళవారం రాత్రి వాడచీపురుపల్లి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 24 క్వార్టర్ మద్యం సీసాలను తీసుకువెళ్తున్నారు. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు మార్గ మధ్యలో అతన్ని తనిఖీ చేసి అతని వద్ద గల 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

కశింకోట, ఏప్రిల్ 9: మండలంలోని నూతనగుంటపాలెంలో కోడిపందాల స్థావరంపై మంగళవారం దాడి చేసి, రెండు కోడిపుంజులు, రూ. 720 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

బాబోయ్.. దోమలు



» జిల్లా కేంద్రంలో దోమలు స్వైరవిహారం
» పగలు, రాత్రి తేడా లేకుండా సంచారం
» దోమల నివారణకు బ్యాట్‌లు, మిషన్లు, అగరబత్తీలు వినియోగం
» రక్తాన్ని పీల్చేస్తున్నాయంటున్న ప్రజలు
» చర్యలు తీసుకుంటున్నామన్న జోనల్ కమిషనర్



నాయుళ్లవీధి కాలువలో దుర్భరంగా మారిన మురుగు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 : జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణ ప్రజలను దోమలు పట్టి పీడిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమకాటు వల్ల పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు. దోమల బారిన పడకుండా ఉండేందుకు ఇళ్లల్లో దోమల నివారణ మిషన్లు, మస్కిటో చక్రాలు, అగరబత్తీలు, దోమల నివారణకు ఎలక్ట్రికల్ బ్యాట్‌లు వినియోగించుకోవాల్సి వస్తుంది. అవి వెలిగినంతసేపు ఉపశమనం కలిగినా ఆ తర్వాత కంటి మీద కునుకు పట్టని పరిస్థితి నెలకొంది. అదే పరిస్థితి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ఉందంటే అతిశయోక్తి కాదు. తమ కార్యాలయాల్లో కూడా దోమలు అధికంగా ఉన్నాయని అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా జోనల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లోనే ఈ పరిస్థితి నెలకొనడం విశేషం. ఎలక్ట్రికల్ బ్యాట్‌లను వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వినియోగించి దోమలు నియంత్రించుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ దోమలు విజృంభిస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడమే దోమల ఉత్పత్తికి కారణంగా తెలుస్తోంది. డిసెంబరు నుంచి మార్చి నెల వరకు దోమలు ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని అధికారులే చెబుతున్నారు. ఇటువంటి సమయాల్లో ఎప్పటికప్పుడు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించడం లేదు. కొన్నిచోట్ల అప్పుడప్పుడు చెత్త, పూడికలు తీసినా వ్యర్థాలను రోజుల తరబడి తొలగించకపోవడంతో ఒక పక్క దుర్వాసన, మరోపక్క దోమల బెడదతో ప్రజలు నరకాన్ని చూస్తున్నారు. ముఖ్యంగా నాయుళ్లవీధి, రింగురోడ్డు తదితర ప్రాంతాల్లోని కాలువల్లో చెత్తా చెదారం పెరిగిపోయి మురికి కూపంగా మారి దోమలకు ఆవాస కేంద్రాలుగా ఏర్పడ్డాయి. దోమ కాటు వల్ల ఎక్కడ వ్యాధుల బారిన పడాల్సి వస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే పట్టణంలో పూర్తిస్థాయిలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రింగురోడ్డు కాలువలో పేరుకుపోయిన చెత్త

దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నాం



\- అయ్యప్పనాయుడు, జడ్సీ

పట్టణంలో దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. ప్రాంతాల వారీగా రోజు ఫాగింగ్ చేస్తున్నాం. కాలువల్లో మలేరియా విభాగం ఫినాయిల్ మందుతో పిచికారీ చేస్తున్నారు. పట్టణంలో కాలువల్లోకి చేరుతున్న వాడుకనీరు, మురుగునీరు పోవడానికి ఔట్‌లెట్ లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంటుంది. పూర్తిస్థాయిలో దోమల నివారణకు సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి అవసరముంది. దీనిపై చర్యలు తీసుకుంటున్నాం. కాలువల్లో కూడా ఎప్పటికప్పుడు పూడికలు, చెత్తను తొలగింపజేసి దోమల నివారణకు చర్యలు చేపడతాం.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న జేసీ కుటుంబసభ్యులు

» అమ్మవారిని దర్శించుకున్న జేసీ, మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 : ఉగాది పర్వదినాన స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ జేసీకి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలు దాటినా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి వస్తూనే ఉన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోదకొండమ్మ సన్నిధిలో సినిమా షూటింగ్

క్లాప్ కొట్టి 'పాడేరు 12వ మైలు' సినిమా చిత్రీకరణ ప్రారంభించిన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ సన్నిధిలో ఒక కొత్త సినిమా షూటింగ్‌కు మంగళవారం శ్రీకారం చుట్టారు. సాయిలక్ష్మి గణపతి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎన్‌కే.సాయి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పాడేరు 12వ మైలు' చిత్రానికి ఐటీడీఏ పీవో వి.అభిషేక్ క్లాప్ కొట్టి ప్రారంభోత్సవం చేశారు. నటీనటులు బోయపాటి శ్రావణ్, సుహనలపై తొలి షాట్‌లను అమ్మవారి సన్నిధి, పాడేరు పట్టణంలోని పలు సన్నివేశాలను చిత్రీకరించారు. పాడేరు ప్రాంతంలోని పలు వాస్తవ ఘటనలు ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని దర్శకుడు ఎన్‌కే.సాయి తెలిపారు. ఈ సినిమాకు కెమెరామన్‌గా గోపి, మ్యూజిక్ డైరెక్టర్‌గా రాము వ్యవహరిస్తుండగా, సహాయకులుగా గ్రంధి త్రినాథ్, శ్రీనివాస్, రాజు, శివ పనిచేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నటీనటులపై క్లాప్ కొడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఈ ప్రాంతం ఎంతో చల్లగా ఉంది: నటుడు శ్రావణ్

పాడేరు ప్రాంతం వేసవిలోనూ ఎంతో చల్లగా ఉందని నటుడు బోయపాటి శ్రావణ్ అన్నారు. హైదరాబాద్ నుంచి ఇక్కడకి వస్తున్న క్రమంలో ఘాట్ మార్గం ప్రయాణంలో ఎంతో ఆహ్లాదకమైన వాతావరణాన్ని ఆస్వాదించామన్నారు. సుమారు పది రోజులు ఈ ప్రాంతంలోనే షూటింగ్ ఉంటుందని, ఈ వేసవిలో ఇక్కడ చల్లని వాతావరణంలో గడుపుతామని శ్రావణ్ ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు ఎన్‌కే.సాయి మాట్లాడుతూ తను గతంలో 'యమునా నది' సినిమా తీశానని, 'పాడేరు 12వ మైలు' పేరిట రెండో సినిమాను తెరకెక్కిస్తున్నానని తెలిపారు.

ఉపమాక భక్త జనసంద్రం

» శ్రీవారిని దర్శించుకున్న భక్తులు





ఉపమాక ఆలయంలో బారులు తీరిన భక్తులు

నక్కపల్లి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం ఉపమాక క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా మంగళవారం రికార్డు స్థాయిలో భక్తులు శ్రీవారిని దర్శించు కున్నారు. కొండపైన, కింద వున్న ఆలయాల్లో స్వామిని దర్శించుకోవడం కోసం భక్తులు బారులుతీరారు. భక్తుల గోత్ర నామాలతో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, పుష్పమాలలతో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. వేదపండితురాలు డాక్టర్ గాయత్రీదేవి పంచాంగ శ్రవణంలో భాగంగా రాశి ఫలాల గురించి వివరించారు. దేశ,రాష్ట్ర కాలమాన, పరిస్థితులు, వర్ష ప్రభావం తదితర అంశాల గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

వైభవంగా చిలకల తీర్థం

» అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు
» కిటకిటలాడిన మంగవరంరోడ్డు



పేరంటాలమ్మ గుడి వద్ద కిక్కిరిసిన జనం



తీర్థంలో పంచదార చిలకలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పాయకరావుపేట, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం చిలకల తీర్థం వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు స్థానిక మంగవరంరోడ్డులోని పేరంటాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న సీతారామాలయ ఆవరణలో పండితులతో క్రోధి నామ సంవత్సరంలో జాతక ఫలాలు చెప్పించుకున్నారు. తీర్థానికి పాయకరావుపేట, తుని పట్టణాలతోపాటు పరిసర 30 గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలి రావడంతో పట్టణంలోని మంగవరంరోడ్డుతోపాటు మెయిన్‌రోడ్డు జనంతో నిండిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఏర్పాటుచేసిన పంచదార చిలకలు, రంగుల చేటలు, ఆటవస్తువులు, తినుబండారాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. తీర్థానికి వచ్చిన ప్రజలకు పలు స్వచ్ఛంద, ఆధ్యాత్మిక సంస్థలు, రాజకీయ నాయకులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం 5 గంటల తరువాత ప్రారంభమైన చిలకల తీర్థం రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో ఎస్ఐలు రమేశ్, జోగారావు సుమారు 80 మంది పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

క్రోధి నామ సంవత్సరంలో ఆరు నెలలు శుభ ముహూర్తాలు లేవు

అచ్యుతాపురం, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సరంలో ఆరు నెలలు శుభ ముహూర్తాలు లేవు. 2024 ఏప్రిల్ 9న ప్రారంభమైన క్రోధి నామ సంవత్సరం 2025 మార్చి 29తో ముగుస్తుంది. అయితే 2024 ఏప్రిల్ 29 నుంచి జూలై 8 వరకు శుక్ర మూఢం. మధ్యలో మే 7 నుంచి జూన్ 7 వరకు గురుమూఢం. కాగా జూలై 8న శుక్రమూఢం అంతం అయినప్పటికీ జూలై ఆరు నుంచి ఆషాడ మాసం ప్రారంభమై ఆగస్టు నాలుగు వరకు ఉంటుంది. ఆషాడ మాసం శూన్యమాసం కాబట్టి ఆ నెలలో కూడా శుభ ముమూర్తాలు ఉండవు. అలాగే సెప్టెంబరు నాలుగు నుంచి అక్టోబరు రెండు వరకు భాద్రపథ మాసం. డిసెంబరు 31 నుంచి 2025 జనవరి 29 వరకు పుష్యమాసం. ఈ రెండు నెలలు కూడా శుభ ముహూర్తాలు ఉండవు. ఇక 2025 మార్చి 18 నుంచి 2025 మర్చి 28 వరకు మరల శుక్రమూఢం ఉంది. అందువల్ల ఈ సంవత్సరంలో సుమారు 170 రోజులు శుభ ముహూర్తాలు లేవు. దీంతో ఈ సంవత్సరం పురోహితులు, బ్రాహ్మణులు, టెంట్‌హౌస్, లైటింగ్, కేటరింగ్ చేసేవారికి కొంత ఆదాయం తగ్గుతుంది.

మూఢమిలో చేయకూడని కార్యక్రమాలు: యజ్ఞ యాగాదులు, వివాహ ఉపనయనాలు, దేవతా విగ్రహ ప్రతిష్ఠలు, క్రతువులు, బావులు, చెరువులు తవ్వించుట, నూతన గృహారంభాలు, గృహప్రవేశాలు, చెవులు కుట్టుట, నూతన వ్యాపారాలు ప్రారంభించకూడదు.

మూఢమిలో చేయదగిన కార్యక్రమాలు: జపహోమాది శాంతులు, గ్రహ శాంతికి అభిషేకాలు, ఆశ్రేష, మూల వంటి గండ నక్షత్రాలకు శాంతులు, సమస్త వ్రతాలు, ఉత్పాదక దోష శాంతులు చేయవచ్చును.

శుభ ముహూర్తాలు ఉన్న రోజులివే..

2024 ఆగస్టు ఐదు నుంచి ఆగస్టు 31 వరకు, అక్టోబరు మూడు నుంచి డిసెంబరు 26 వరకు, 2025 జనవరి 30 నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలు ఉన్నాయి.

విశాఖ ఉక్కులో వీఆర్ఎస్

» 2,500 మందిని తగ్గించాలని ప్రణాళిక
» అన్ని విభాగాల్లో ఇప్పటికే సిబ్బంది కొరత
» స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదిలేసేవారికి వెంటనే సొమ్ములు ఇచ్చేందుకు సిద్ధం
» రూ.1,445 కోట్లు ఇస్తామని కేంద్రం ప్రకటన



స్టీల్‌ప్లాంటు


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి భారీ ప్రణాళిక సిద్ధమవుతోంది. అప్పులు అధికంగా ఉన్నాయని, ముడి పదార్థాల కొరత ఉందని ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరితే నిరాకరించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాని(వీఆర్ఎస్)కి మాత్రం నిధులు ఇస్తామని(బడ్జెట్ సపోర్టు) ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో 2,500 మందిని తీసేస్తే వారికి పరిహారంగా ఇవ్వడానికి రూ.1,445 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అయితే, వీఆర్ఎస్ ప్రక్రియ అంతా ఏడాదిలోనే పూర్తి చేయాలని షరతు పెట్టడం గమనార్హం. ప్రస్తుతం విశాఖ ఉక్కులోని అన్ని విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ఐదుగురు పనిచేయాల్సిన చోట ముగ్గురే చేస్తున్నారు. పని ఒత్తిడి అధికంగా ఉంది. నాలుగేళ్ల నుంచి కొత్త నియామకాలు ఆపేశారు. మరోవైపు ఏడాదికి 700 నుంచి 800 మంది పదవీ విరమణ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఇంకో వెయ్యి మంది రిటైర్ కానున్నారు. 2027 చివరికి 4 వేల మంది రిటైర్‌మెంట్ పేరుతో బయటకు వెళ్లిపోతారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 14 వేల మంది ఉన్నారు. 2027 నాటికి వారి సంఖ్య 10 వేలకు పడిపోతుంది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని అస్మదీయులైన కార్పొరేట్లకు అప్పగించేటపుడు వారిపై జీతాల భారం అధికంగా ఉండకూడదని రిక్రూట్‌మెంట్ పూర్తిగా ఆపేశారు. ఉన్నవారిని కూడా పంపించేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. నిలదొక్కుకోవడానికి సాయం అడిగితే స్పందించని కేంద్ర ప్రభుత్వం వీఆర్ఎస్‌కు మాత్రం రూ.1,445 కోట్లు ఇవ్వడానికి ముందుకు రావడంపై కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో ఇలా ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు ప్రధాని పీవీ నరసింహారావు రూ.1,200 కోట్లు, ఆ తరువాత వాజపేయి మరో రూ1.400 కోట్లు సాయం చేశారు. ఆనాటి అప్పులను రద్దు చేసి వాటాను మూలధనంగా మార్చారు. దీనివల్ల స్టీల్‌ప్లాంటు మళ్లీ లాభాల బాటలోకి వచ్చి సొంత నిధులతో రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యం సాధించింది.

వీఆర్ఎస్ తీసుకునేలా..

విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి ఎలాగోలా బయటపడితే చాలనే అభిప్రాయం ఉద్యోగుల్లో బలంగా వినిపిస్తోంది. గత కొద్ది నెలలుగా జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేకపోతున్నారు. ఈ నెల 50 శాతం జీతం సోమవారం ఇచ్చారు. భవిష్యత్తులో ఇంకెలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియవని హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులకు 15 ఏళ్ల నుంచి పే రివిజన్ లేదు. తక్కువ జీతాలకే పనిచేస్తున్నారు. పదోన్నతులు లేవు. 30-40 ఏళ్ల వయసున్న ఉద్యోగులు ఇక్కడుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని భావించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత రెండేళ్లలో 500 మంది రాజీనామా చేసి ఇతర సంస్థలకు వెళ్లిపోయారు. పదవీ విరమణకు చేరువైన వారు మాత్రం యాజమాన్యం జీతాలు ఇవ్వలేకపోతున్నది కాబట్టి.. కేంద్రం ఇచ్చే వీఆర్ఎస్ ప్యాకేజీ తీసుకొని వెళ్లిపోవడమే మంచిదని ఆలోచిస్తున్నారు.

భక్తులే పెళ్లి పెద్దలుగా అప్పన్న పెళ్లి రాట ఉడుపు



పందిరిరాట ఉడుపులో పాల్గొన్న భక్తులు

సింహాచలం, ఏప్రిల్ 9: చైత్రమాస శుక్లపక్ష ఏకాదశి అనగా ఏప్రిల్ 19న జరగనున్న సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలకు మంగళవారం పందిరిరాట ఉడుపుతో సంప్రదాయబద్ధంగా వైదికులు శ్రీకారం చుట్టారు. ఉగాది పర్వదినాన భక్తులే పెళ్లి పెద్దలుగా వైదిక అధికారులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు, సీతారామాచార్యులు పూజలు చేయగా పాల్గొన్న భక్తులు రాటలకు పసుపు, కుంకుమలు అద్దారు. అనంతరం గోవింద నామ స్మరణల నడమ ఆలయ కల్యాణ మండపానికి చేరువలో తొలి పందిరిరాటను, ప్రధాన రాజగోపురం వద్ద రెండవది, మూడో రాటను కల్యాణ వేదిక వద్ద పందిరిరాట ఉడుపును ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, ఈఈ డీజీ శ్రీనివాసరాజు వేశారు. ఉగాది కార్యక్రమాలలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, ప్రభాత సేవల అనంతరం స్వామివారికి నివేదన తరువాత భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు, ఈఈ బండారు రాంబాబు, ఏఈఓలు రమణమూర్తి, ఆనందకుమార్, రాజేంద్రకుమార్, నరసింహరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట వచ్చిన రఘురామకృష్ణరాజు



ఎంపీ రఘురామకృష్ణరాజుని కలిసిన అనిత, తదితరులు

పాయకరావుపేట, ఏప్రిల్ 9 : పాయకరావుపేట వచ్చిన నర్సాపురం ఎంపీ, టీడీపీ నాయకుడు రఘురామకృష్ణంరాజును తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, తదితరులు కలిశారు. మంగళవారం కాకినాడ జిల్లా తుని మండలంలోని తలుపులమ్మ తల్లిని దర్శించుకున్న రఘురామకృష్ణంరాజు అనంతరం పాయకరావుపేటలోని ఆయన బంధువుల ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా వంగలపూడి అనితతోపాటు జనసేన పార్టీ నాయకులు తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్డి నాగవెంకటరమణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

'చంద్ర' ఆశయ సాధనకు కృషి చేయాలి



చంద్ర రాజేశ్వరరావుకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తుమ్మపాల, ఏప్రిల్ 9 : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాటమే శరణ్యమని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది పేదలకు భూపోరాటం చేసి భూములను పంచిపెట్టిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరాలశెట్టి సత్యనారాయణ, సాయి లక్ష్మణ్, కోరిబిల్లి శంకరరావు, సూరిబాబు, కోన లక్ష్మణ, సంతోష్, సతీష్, రమణ పాల్గొన్నారు.

గౌరీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉగాది పురస్కారాలు



విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేస్తున్న దృశ్యం

తుమ్మపాల, ఏప్రిల్ 9: తుమ్మపాల గౌరీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉగాది పురస్కారాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అడిషినల్ డైరెక్టర్ ఆడారి రవికుమార్ దిబ్బపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.దేదీప్యా, కొప్పాక జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్. హర్షవర్ధన్‌తోపాటు పది మంది విద్యార్థులకు నగదు బహుమతితోపాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట ఎంఈవో బుద్ద కాశీ, సంఘం అధ్యక్షుడు ఆడారి నారాయణమూర్తి, గౌరవాధ్యక్షుడు రాపేటి నాగేశ్వరరావు, సభ్యులు ఆళ్ల గోవిందరావు, కొణతాల నరసింగరావు, మళ్ల శ్రీనివాసరావు, పీలా నారాయణరావు, టీకేవీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేంపాడులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నక్కపల్లి, ఏప్రిల్ 9: మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు ఉగాది నాడు కలుసుకున్నారు. 20 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రతీ సంవత్సరం నిరుపేద విద్యార్థులకు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం కలిసి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

ఘనంగా మల్లమ్మతల్లి పేరంటాల తీర్థం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 : స్థానిక లక్ష్మీదేవిపేటలో వెలసిన మల్లమ్మతల్లి పేరంటాల తీర్థం మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. మల్లమ్మతల్లిని పలువురు రాజకీయ నాయకులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

కశింకోట, ఏప్రిల్ 9 : మండలంలోని కన్నూరుపాలెంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్టు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు 52 పేక ముక్కలు, రెండు వేల ఏడు వందల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పండగ పూట కూడా వేతనాల్లేవు

▸▸ గోపాలమిత్రల సంఘం అధ్యక్షుడు గుడివాడ కిశోర్



విలేకర్లతో మాట్లాడుతున్న గుడివాడ కిశోర్

సబ్బవరం, ఏప్రిల్ 9 : పండగ పూట కూడా తమను ప్రభుత్వం పస్తులు ఉంచుతుందని గోపాలమిత్రల సంఘం అధ్యక్షుడు గుడివాడ కిశోర్ ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఇవ్వవలసిన గౌరవ వేతనం రూ.6,500 గత ఆరు నెలలుగా చెల్లించడం లేదన్నారు. ఉగాది నాడు తమ పిల్లలు ఏమి తింటారని ఆయన ప్రశ్నించారు. తెలుగు దేశం ప్రభుత్వం రూ.6,500 గౌరవ వేత నం ఇచ్చేదని, వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు ముందు జగన్ పాదయాత్రలో తమకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న తమ ఆరు నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం భాస్కరరావు, సీహెచ్ అప్పలరాజు, జి.దేవుడుబాబు పాల్గొన్నారు.

ఊరూరా ఉగాది సంబరాలు



ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పండితులు



ఎలమంచిలి టిడ్కో సముదాయంలోని ఆంజనేయ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కొత్తూరు, ఏప్రిల్ 9 : స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజేటి గోపఅప్పలాచార్యులు (చక్రవర్తి) పంచాంగ శ్రవణంలో నూతన సంవత్సరంలో మంచి, చెడులను వివరించారు. అనంతరం సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఈ ఉగాది ప్రజలందరి జీవితాలలో సుఖ, సంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. పంచాంగ శ్రవణం చేసిన గోపఅప్పలాచార్యులను సీఎం రమేశ్, శ్రీదేవి దంపతులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, చోడవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీఎస్ఎన్.రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖ సిద్ధాంతి బంకుపల్లి సత్యనారాయణ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, బోడి వెంకట్రావు, బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, మళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు. కశింకోటలో నూకాంబిక అమ్మవారిని జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు.

తుమ్మపాలలో.. పట్టణంలోని జార్జిక్లబ్‌లో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పతాంజలి యోగా సమితి తెలుగు రాష్ట్రాల యువజన అధ్యక్షుడు స్వామి అశోక్ ఆర్య, జార్జిక్లబ్ సభ్యులు పెంటకోట సుబ్రహ్మణ్యం, బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వనాథ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్‌లో.. మండలంలోని ఉగాది వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రజలు నిర్వహించుకున్నారు. సిరసపల్లిలోని గణపతి దత్త క్షేత్రంలో అర్చకులు పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. ఉగాది పండుగను మంగళవారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. భక్తులు నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వచ్చి పంచాంగ శ్రవణాన్ని విన్నారు. ఆదాయ, వ్యయాలు, రాజపూజ్య, అవమానాలు వంటివి ప్రజలకు వివరించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయాలతో పాటు గ్రామాల్లో ఉగాది సందడి కనిపించింది.

ఎలమంచిలిలో.. క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఎలమంచిలి కొత్తపేట, తులసీనగర్, పాతవీధి, పెదపల్లి, సోమలింగపాలెం, యర్రవరం, రామ్‌నగర్ ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సబ్బవరంలో.. మండల వ్యాప్తంగా ప్రజలు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలిజపాలెం దుర్గాలమ్మతల్లి ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మి, కొండాజీ, సురేశ్‌రాజ్, తదితరులు పూజలు చేశారు.

పాయకరావుపేటలో.. క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం పట్టణంలో వైభవంగా జరిగాయి. పాండురంగస్వామి, సీతా రామాలయం, వెంకటేశ్వరస్వామి, దుర్గాలమ్మచెట్టు, షిర్డీసాయి, కనకదుర్గమ్మ ఆలయాలను సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

ఎస్.రాయవరంలో.. మండల ప్రజలు ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచే ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రావణం నిర్వహించారు. కోరుప్రోలు కోదండ రామాలయంలో ఏటికొప్పాక గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతలపాటి వెంకటపతిరాజుతోపాటు పలువురు విశ్రాంతి ఉద్యోగులను గ్రామస్థులు సన్మానించారు. చుండూరి సాయి వైష్ణవి, చుండూరి సూర్య సత్య శ్రీనివాస్ నిత్య కళా ప్రదర్శన నిర్వహించారు.

రాంబిల్లిలో.. మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉగాది సంబరాలను జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. గ్రామాల్లోని రామాలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

పరవాడలో.. మండల వ్యాప్తంగా మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజలంతా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం పఠించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీసభ్యుడు పైలా సన్యాసిరాజు, మండల ప్రజలకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎస్.రాయవరం: కొరుప్రోలులో పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటపతిరాజుతోపాటు పలువురిని సన్మానించిన దృశ్యం

అర్చకులకు ఉగాది పురస్కారాలు

కొత్తూరు(అనకాపల్లి), ఏప్రిల్ 9 : జిల్లాలోని పలు ఆలయాల అర్చకులకు ఉగాది పురస్కారాలను దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మంగళవారం అందజేశారు. అనకాపల్లి పట్టణంలోని జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారిణి కేఎల్.సుధారాణి కార్యాలయంలో క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా 12 మంది అర్చకులకు సన్మానపత్రం, రూ.10,116లు చెక్కులను అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ అర్చకుల సర్వీసును గుర్తించి సన్మానం చేశామన్నారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య అధ్యక్షుడు పులకండం ప్రసాద్, కార్యదర్శి పేరూరి భోగలింగం (బుజ్జి), దేవదాయ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాసరాజు, శ్రీధర్, ఈవో కె.ఆదినారాయణ, టి.రాజసులోచన, ఎస్‌వీవీ. సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, ఎస్.గంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్చకుడు విజయబాబుకు ఉగాది పురస్కారాన్ని అందజేస్తున్న సుధారాణి

మంచినీరు సరఫరా లేక అవస్థలు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 9: మండలంలోని తారకరామకాలనీ, అక్కిరెడ్డిపాలెం గ్రామాల ప్రజలు తాగునీరు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం కావడంతో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదై భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీనికితోడు కొండవాలు ప్రాంతం కావడంతో బోర్లుకు నీరందకపోవడంతో మోటార్లు మొరాయిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 20 రోజుల నుంచి మంచినీటి కొళాయిల ద్వారా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకుని తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



కొళాయి వద్ద నీటి కోసం వేచి ఉన్న మహిళలు

నీలిగుంట రహదారి గతుకుల మాయం

కోటవురట్ల, ఏప్రిల్ 9: మండలంలో నీలిగుంట రహదారి గతుకులమయమై అధ్వానంగా తయారైంది. సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి దారుణంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో రోడ్డు శిథిలమైంది. దీంతో వాహనాలపై రాకపోకలు సాగించేవారు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. కేబీ అగ్రహారం నుంచి నీలిగుంటకు వెళ్లే రహదారి జి.సన్యాసిరాజుపాలెం వద్ద అడుగడుగునా గంతులు ఏర్పడ్డాయి. రోడ్డు శిథిలమై వర్షం పడితే చిన్న చెరువును తలపిస్తున్నది. అంతేకాకుండా ఈ రోడ్డుపై సరుగుడు లారీలు భారీ లోడులతో వెళుతున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా పాడవుతున్నది. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి ఈ రహదారి మరమ్మతులపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న జి.సన్యాసిరాజుపాలెం రోడ్డు

వైసీపీకి షాక్

... 5వ పేజీ తరువాయి

బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌తోపాటు మంగళవారం విజయవాడలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిపోయారు. వైసీపీకి చెందిన మరో ఐదుగురు కార్పొరేటర్లు కూడా సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా త్వరలో టీడీపీలో చేరే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగిన సీతంరాజు సుధాకర్ దక్షిణ నియోజకవర్గం టికెట్ ఆశించారు. గత నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే టీడీపీ తరఫున గెలిచి తమ పార్టీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కే వైసీపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది. దీంతో సుధాకర్ కొంతకాలం కిందట వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనతోపాటు వైసీపీకి చెందిన ఏడుగురు కార్పొరేటర్లు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. అసమ్మతి కార్పొరేటర్లను వైసీపీ నేతలు పిలిచి బుజ్జగించడంతో వారంతా సందిగ్ధంలో పడ్డారు. తాజాగా మంగళవారం సీతంరాజు సుధాకర్ విజయవాడ వెళ్లి చంద్రబాబునాయుడును కలిసి టీడీపీ కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరాజు, గరుడ సత్రం ధర్మకర్త చరకం మణమ్మ, 35వ వార్డు వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, వర్తక సంఘం జిల్లా సభ్యులు రామిరెడ్డి, నిమ్మ శ్రీనివాస్, ముక్కు శ్రీనులు టీడీపీలో చేరారు.

దక్షిణ నియోజకవర్గానికి చెందిన మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు కూడా త్వరలో టీడీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సుధాకర్‌కు ఏదైనా బాధ్యత అప్పగించిన వెంటనే తాము కూడా టీడీపీలో చేరిపోతామని దక్షిణ నియోజకవర్గానికి చెందిన వైసీపీ అసమ్మతి కార్పొరేటర్ ఒకరు తెలిపారు.

నెరవేరని సొంతింటి కల

... 5వ పేజీ తరువాయి

నిర్మించుకునేందుకు సొంతంగా స్థలాలు కలిగి ఉన్న 8,262 మందికి బీఎల్‌సీ (లబ్ధిదారుడే నిర్మాణం చేసుకోవడం) కింద పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని నిర్ణయించారు. స్థలాలు లేనివారికి ప్రభుత్వమే 300, 365, 430 చదరపు అడుగుల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. 300 చదరపు అడుగులు కోసం రూ.25 వేలు, 365 చదరపు అడుగుల ఇంటి కోసం రూ.50 వేలు, 430 చదరపు అడుగుల రూ.లక్ష చొప్పున డీడీలు తీయాలని ప్రభుత్వం ఆదేశించగా, 43,844 మంది డీడీలు తీసి జీవీఎంసీకి అందజేశారు. టిడ్కో కింద జీవీఎంసీ పరిధిలో 55 వేల ఇళ్ల నిర్మాణానికి సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రై జంక్షన్, దువ్వాడ, ఖానోజీతోట, అగనంపూడి, బర్మా కాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సిరసపురం, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలాపల్లి, పరవాడ, అప్పికొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శ నగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మ కాలనీ, రాజీవ్ నగర్‌కాలనీ, గౌరీనగర్, ఏఎస్ఆర్ నగర్ వంటి మురికివాడలను తొలగించి అదే స్థలంలో 1,256 ఇళ్లు చొప్పున మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో దాదాపు నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో టీడీపీ ప్రభుత్వం 2019 మార్చిలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించేసింది. తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల కేటాయింపును రద్దు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ, కొత్తగా మళ్లీ సర్వే చేసి గతంలో అర్హులుగా గుర్తించడంతో డీడీలు తీసిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చింది. మిగిలిన 30,083 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. వీరందరికీ సరిపడా ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో లాటరీ ద్వారా 24,192 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. మిగిలిన వారికి గతంలో తీసిన డీడీలను వెనక్కి ఇవ్వడంతోపాటు ఒక సెంటు చొప్పున జగనన్న కాలనీల్లో ఒక సెంటు చొప్పున స్థలాన్ని అందజేస్తామని చెప్పింది.

ఐదేళ్లలో అడుగు ముందుకు పడని పనులు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన సముదాయాలకు ఉన్న రంగులను మార్చేసి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయించింది. వైసీపీ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించిన మంత్రులు గత ఐదేళ్లలో కేవలం 7,456 ఇళ్లు మాత్రమే (టీడీపీ హయాంలో చివరి దశకు చేరిన నిర్మాణాలను పూర్తిచేయడంపైనే దృష్టిపెట్టారు తప్పితే మిగిలిన నిర్మాణాలను విస్మరించారు) లబ్ధిదారులకు అప్పగించారు. వీటిలో చాలాచోట్ల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లలోకి వెళ్లలేదు. దీంతో అవన్నీ ఖాళీగానే ఉండిపోయాయి. బక్కన్నపాలెంలో టిడ్కో సముదాయాలు ముళ్లపొదలతో మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. చీమలాపల్లిలో మొండిగోడలతోనే నిర్మాణాలను నిలిపేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఐదేళ్లలో అదిగో...ఇదిగో అంటూ ఆశల పల్లకిలో ఊరేగించిన వైసీపీ నేతలు, అధికారులు ఇప్పటికీ తమకు సొంత ఇంటి కల నెరవేరకుండా చేశారంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ప్రత్యేక అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 : ఉగాది పండుగ సందర్భంగా గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భోగాపురపు వెంకటరమణ అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో కనకదుర్గమ్మ

కస్పావీధిలో శ్రీరామనవమి పెళ్లిరాట



శ్రీరామనవమి పెళ్లిరాట వేస్తున్న దృశ్యం

కశింకోట, ఏప్రిల్ 9 : స్థానిక కస్పావీధి రామాలయం వద్ద ఈనెల 17న జరగనున్న శ్రీరాముని కల్యాణ మహోత్సవానికి మంగళవారం పెళ్లి రాట వేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సిప్పి అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు, ముక్కా రాజు, మహిళలు పాల్గొన్నారు.

పట్టపగలే వీధి దీపాల వెలుగులు

పరవాడ, ఏప్రిల్ 9 : కలపాక పంచాయతీ శివారు స్వయంభూవరంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. కొద్ది రోజుల నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని అవగాహన కల్పించే అధికారులే వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్ బిల్లు కట్టలేక పంచాయతీలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇక్కడ మాత్రం విరుద్ధంగా పగలే వెలుగులు నింపుతున్నాయి. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి పగలే వెలుగులకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



స్వయంభూవరంలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

ముత్యాలమ్మపాలెం ఆర్టీసీ బస్సు నడపాలి

పరవాడ, ఏప్రిల్ 9 : మత్స్యకార గ్రామమైన ముత్యాలమ్మపాలెం నుంచి పరవాడ మీదుగా అనకాపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్థులు కోరుతున్నారు. బస్సు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం అనకాపల్లికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలో అనకాపల్లి డిపోకు చెందిన రెండు బస్సులు ముత్యాలమ్మపాలెంకు తిరిగేవని, అయితే సర్వీసు లేదన్న సాకుతో అధికారులు బస్సులను నిలుపుదల చేశారని వాపోయారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు అధిక మొత్తంలో డబ్బులు గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ముత్యాలమ్మపాలెంకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా సీతారాముల పెండ్లి రాట



శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పెండ్లిరాట వేస్తున్న భక్తులు

ఎలమంచిలి, ఏప్రిల్ 9: ఈనెల 17వ తేదీన శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొత్తపేట సీతారాముల ఆలయం వద్ద మంగళవారం సీతారాముల పెండ్లి రాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో పెండ్లి రాట వేశారు. పెండ్లిరాట ఉత్సవం మొదలుకుని శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పిళ్లా కనకమని, పిళ్లా త్రినాథ్ న్యాయవాది కూనిశెట్టి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

ఎలమంచిలి, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేశారు. మండలంలోని మర్రిబంద సమీపంలో రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ నిర్వహిస్తున్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరికలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 9: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని చీమలాపల్లి పంచాయతీ అప్పన్నపాలెం నుంచి వైసీపీ నాయకుడు రెడ్డి నాయుడు, వార్డు మెంబర్ రెడ్డి నూకరాజు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అలాగే ఉప్పవరం, నరేంద్రపురం నుంచి వైసీపీ శ్రేణులు, ఎలమంచిలి రూరల్ మండలం లక్కవరం, తరంగాలపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు మంగళవారం జనసేనలో చేరారు. వీరందరికీ ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

విశాఖ నుంచి బ్యాంకాక్ విమానం ప్రారంభం

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి బ్యాంకాక్ వెళ్లేందుకు కొత్త విమాన సర్వీసు మంగళవారం అందుబాటులోకి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు కూడా ఇది ఉపయోగపడుతుంది. ఎయిర్ ఆసియా సంస్థ వారానికి మూడు రోజుల ఈ సర్వీసును నడపనున్నది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విమాన సంఘం ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, వర్మ, విజయమోహన్ మాట్లాడుతూ భారత కాలమానం ప్రకారం ఇది విశాఖపట్నంలో రాత్రి 11.50 గంటలకు బయలుదేరి 2.30 గంటలకు బ్యాంకాక్‌లో ల్యాండ్ అవుతుందన్నారు. అక్కడ రాత్రి 7.50 గంటలకు బయలుదేరే విమానం విశాఖపట్నంలో అదేరోజు రాత్రి 11.20 గంటలకు చేరుతుందన్నారు.. ఇది మంగళ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నర్సీపట్నం
నియోజకవర్గం


సీఎం రమేష్‌కు వినాయకుని చిత్రపటం ఇస్తున్న నేతలు

సీఎం రమేష్‌కు వినాయకుని చిత్రపటం బహూకరణ

నాతవరం, ఏప్రిల్ 9: మండలానికి చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు మంగళవారం అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను కలిసి వినాయకస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. వారంతా ఉగాది వేడుకల్లో పాల్గొని సీఎం రమేష్‌కు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని ఈ సందర్భంగా ఇరు పార్టీల నేతలు వై.కాశీ, ఎం.అప్పారావు, ఎల్.విక్రమ్, గవిరెడ్డి త్రినాథ్ పేర్కొన్నారు.

టీడీపీలోకి తామరం వైసీపీ కార్యకర్తలు

మాకవరపాలెం, ఏప్రిల్ 9: మండలంలోని తామరం గ్రామంలో వైసీపీ నుంచి పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ నేత కోసూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకోగా, నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు తనయుడు రాజేష్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, మాజీ సర్పంచ్ కనకం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక పండుగ

మాకవరపాలెం, ఏప్రిల్ 9: మండలంలోని దాలింపేట గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మధ్యాహ్నం గుడి వద్ద భారీ అన్నసంతర్పణ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాలింపేట పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూజలు అందుకున్న అమ్మవారు

వాడవాడలా ఉగాది వేడుకలు

నర్సీపట్నం, ఏప్రిల్ 9: నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో మంగళవారం ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతీ ఇంటి ఆవరణలో మామిడి తోరణాలు, పూలమాలలతో ఆలంకరించారు. ఇంటిల్లపాదీ తెల్లవారుజామునే తలంటు పోసుకొని సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ అలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దుర్గామల్లేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, బాల వినాయకుడు, షిరిడీసాయి, కాశీ విశ్వేశ్వరస్వామి, స్వామి అయ్యప్ప ఆలయాల వద్ద అభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం షడ్రుచులతో ఉగాది పచ్చడి చేసుకున్నారు.

నర్సీపట్నం అర్బన్: పలు గ్రామాల్లోని రామాలయాల్లో ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అలాగే మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడిని ఆరగించారు. వేములపూడి, చెట్టుపల్లి, అమలాపురం, యరకన్నపాలెం, గబ్బాడ, ధర్మసాగరం, గురందొరపాలెం తదితర గ్రామాల్లో వేదపండితుల పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో వాడవాడలా ఉగాది పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్లకు మామిడి, నేరేడు కొమ్మలను కట్టుకుని ప్రజలు సందడిగా గడిపారు. అలాగే ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పంచిపెట్టారు. ఉదయాన్నే తలంటూ స్నానం చేసి దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. రైతన్నలు తమ పొలాల్లో ఈ ఏడాది నాగలితో కొత్తగా పనులు ప్రారంభించారు. జీడిపిక్కల వ్యాపారులు ఉగాది రోజున మొదటిసారిగా రైతుల నుండి జీడిపిక్కలు కొనుగోలు చేశారు. అలాగే మండల కేంద్రం నాతవరం రామాలయంలో పండితులు పంచాంగ శ్రావణం వినిపించారు. కొత్త సంవత్సరంలో రాశులు, వాటి ఫలితాలను పండితులు వివరించారు. ఈ వేడుకలలో ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక తదితరులు పాల్గొన్నారు.


బాల వినాయకస్వామి ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


నాతవరం రామాలయంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ, ఏప్రిల్ 9: మండలంలోని పలు గ్రామాల రామాలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు సంవత్సరాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉగాది పచ్చడి పంచారు. అనంతరం ఆయా రామాలయాల్లో వెదపండితులతో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోధినామ సంవత్సర ఫలితంతో పాటు ఆయా ప్రజల సంవత్సర ఫలితాలను అర్చకులు చదివి వినిపించారు. రావణాపల్లి, గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, ఏఎల్. పురం, చోద్యం, లింగంపేట, నాగాపురం, పాకలపాడు, కొంగశింగి, కొత్తఎల్లవరం, ఏటిగైరంపేట, గుండుపాల గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయాల్లో ఆయా గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలు అప్పగించకపోతే పోలీసు ఫిర్యాదు

▸▸ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 9: మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆభరణాలను అప్పగించకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తెలిపారు.

మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిడితల్లి ఆలయాన్ని కట్టించింది, విగ్రహం పెట్టించింది తామైతే, తన మీద కోపంతో జమీలు, ఎమ్మెల్యే గణేశ్‌తో కలిసి ఆలయాన్ని ప్రభుత్వంలో కలిపేశారని, అమ్మవారి ఆభరణాలు జమీలు దగ్గర ఉన్నాయని చెప్పారు. ఆభరణాలు గత పండక్కి ఇవ్వలేదని, ఈ ఏడాది ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే ఈ ఏడాది ఎన్నికలు, పండగ ఒకేసారి వచ్చాయని, నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వ్యక్తి పండగ చేయకూడదని స్పష్టం చేశారు. సమయం చాలా తక్కువ ఉన్నందున పెద్దలంతా కమిటీగా ఏర్పడి పండగ చేస్తే అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల విజయ్, పద్మావతి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అయ్యన్న

వైసీపీకి షాక్

... 5వ పేజీ తరువాయి

బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్‌తో పాటు మంగళవారం విజయవాడలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిపోయారు. వైసీపీకి చెందిన మరో ఐదుగురు కార్పొరేటర్లు కూడా సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా త్వరలో టీడీపీలో చేరే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగిన సీతంరాజు సుధాకర్ దక్షిణ నియోజకవర్గం టికెట్ ఆశించారు. గత నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే టీడీపీ తరఫున గెలిచి తమ పార్టీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కే వైసీపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది. దీంతో సుధాకర్ కొంతకాలం కిందట వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనతో పాటు ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. అసమ్మతి కార్పొరేటర్లను వైసీపీ నేతలు బుజ్జగించడంతో సందిగ్ధంలో పడ్డారు. తాజాగా మంగళవారం సుధాకర్ విజయవాడ వెళ్లి చంద్రబాబును కలిసి టీడీపీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు కార్పొరేటర్ నారాయణరావు, దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరాజు, గరుడ సత్రం ధర్మకర్త సిహెచ్.మణమ్మ, 35వ వార్డు వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, వర్తక సంఘం జిల్లా సభ్యులు రామిరెడ్డి, నిమ్మ శ్రీనివాస్, శ్రీను టీడీపీలో చేరారు. దక్షిణ నియోజకవర్గంలోని మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరే అవకాశం ఉందని తెలిసింది.

నెరవేరని సొంతింటి కల

... 5వ పేజీ తరువాయి

నిర్మించుకునేందుకు సొంతంగా స్థలాలు కలిగి ఉన్న 8,262 మందికి బీఎల్‌సీ (లబ్ధిదారుడే నిర్మాణం చేసుకోవడం) కింద పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని నిర్ణయించారు. స్థలాలు లేనివారికి ప్రభుత్వమే 300, 365, 430 చదరపు అడుగుల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. 300 చదరపు అడుగులు కోసం రూ.25 వేలు, 365 చదరపు అడుగుల ఇంటి కోసం రూ.50 వేలు, 430 చదరపు అడుగుల రూ.లక్ష చొప్పున డీడీలు తీయాలని ప్రభుత్వం ఆదేశించగా, 43,844 మంది డీడీలు తీసి జీవీఎంసీకి అందజేశారు. టిడ్కో కింద జీవీఎంసీ పరిధిలో 55 వేల ఇళ్ల నిర్మాణానికి సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రై జంక్షన్, దువ్వాడ, భానోజీతోట, అగనంపూడి, బర్మా కాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సిరసపురం, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలాపల్లి, పరవాడ, అప్పికొండ, నడుపూరు, లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. వీటితోపాటు సుద్దగెడ్డ, ఆదర్శ నగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యాలమ్మ కాలనీ, రాజీవ్ నగర్‌కాలనీ, గౌరీనగర్, ఏఎస్‌ఆర్ నగర్ వంటి మురికివాడలను తొలగించి అదే స్థలంలో 1,256 ఇళ్లు చొప్పున మొత్తం 31 లేఅవుట్లలో 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో దాదాపు నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో టీడీపీ ప్రభుత్వం 2019 మార్చిలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించేసింది. తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల కేటాయింపును రద్దు చేసింది.

లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ, కొత్తగా మళ్లీ సర్వే చేసి గతంలో అర్హులుగా గుర్తించడంతో డీడీలు తీసిన వారిలో 13,761 మందిని అనర్హులుగా తేల్చింది. మిగిలిన 30,083 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. వీరందరికీ సరిపడా ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో లాటరీ ద్వారా 24,192 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. మిగిలిన వారికి గతంలో తీసిన డీడీలను వెనక్కి ఇవ్వడంతో పాటు ఒక సెంటు చొప్పున జగనన్న కాలనీల్లో ఒక సెంటు చొప్పున స్థలాన్ని అందజేస్తామని చెప్పింది.

ఐదేళ్లలో అడుగు ముందుకు పడని పనులు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన సముదాయాలకు ఉన్న రంగులను మార్చేసి వైసీపీ జెండాను పోలిన రంగులను వేయించింది. వైసీపీ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించిన మంత్రులు గత ఐదేళ్లలో కేవలం 7,456 ఇళ్లు మాత్రమే (టీడీపీ హయాంలో చివరి దశకు చేరిన నిర్మాణాలను పూర్తిచేయడంపైనే దృష్టిపెట్టారు తప్పితే మిగిలిన నిర్మాణాలను విస్మరించారు) లబ్ధిదారులకు అప్పగించారు. వీటిలో చాలాచోట్ల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లలోకి వెళ్లలేదు. దీంతో అవన్నీ ఖాళీగానే ఉండిపోయాయి. బక్కన్నపాలెంలో టిడ్కో సముదాయాలు ముళ్లపొదలతో మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. చీమలాపల్లిలో మొండిగోడలతోనే నిర్మాణాలను నిలిపేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఐదేళ్లలో అదిగో...ఇదిగో అంటూ ఆశల పల్లకిలో ఊరేగించిన వైసీపీ నేతలు, అధికారులు ఇప్పటికీ తమకు సొంత ఇంటి కల నెరవేరకుండా చేశారంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

చోడవరం
నియోజకవర్గం

రోడ్డు నిర్మాణంతో తీరనున్న కష్టాలు


చక్కగా రూపు దిద్దుకున్న రావికమతం- కింతలి ఆర్అండ్‌బీ రోడ్డు

రావికమతం, ఏప్రిల్ 9: రావికమతం-మాడుగుల రెండు మండలాల్లో 30 గ్రామాలకు ఏకైక రహదారి అభివృద్ధికి నోచుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రావికమతం నుంచి కింతలి మీదుగా మాడుగుల వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమైంది. దీంతో రాక పోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఈ మార్గంలో నర్సీపట్నం నుంచి మాడుగుల వరకు తిరిగే ఆర్టీసీ బస్సును కూడ గోతుల వల్ల గత రెండేళ్లుగా నిలిపేశారు. . దీంతో ఇటు రావికమతం, అటు మాడుగులు వెళ్లేందుకు కవ్వగుంట, బుడ్డిబంద, కేబీపీ అగ్రహారం, చినపాచిల, గుమ్మాళ్ళపాడు,కొమిర తదితర గ్రామాల ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోల్లో ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది. ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని రెండు మండలాల ప్రజాప్రతి నిధులు, ప్రజలు విప్పు ధర్మశ్రీ దృష్టికి తేవడంతో ఆయన విజ్ఞపుల మేరకు ప్రభుత్వం సుమారు రూ. కోట్లు మంజూరయ్యాయి. దీంతో రావికమతం నుంచి కవ్వగుంట వరకూ ఏడు కిలో మీటర్ల మేర బీటీ రోడ్డును కాంట్రాక్టర్ మంగళవారంతో పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వలంటీర్లతో ఓటర్ల వివరాల సేకరణ?

▸▸ రోలుగుంట మండలంలో వైసీపీ నేతలు తెరవెనుక యత్నాలు

రోలుగుంట, ఏప్రిల్ 9 : ఈ ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందేలా వైసీపీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ వలంటీర్లను వినియోగించుకోవాలని ఎన్నో ప్రయోగాలు చేశారు. తాజాగా రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా వైసీపీ నాయకులు వలంటీర్లతో ఓటర్ల వివరాల నమోదుకు తెరలేపారు. గతనెలలోనే ఎమ్మెల్యే ధర్మశ్రీ అన్ని గ్రామాల వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పక్కాగా తమకు కేటాయించిన 50 కుటుంబాల వివరాలు సేకరించి ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం. దీంతో వలంటీర్లు గుట్టుచప్పుడు కాకుండా ఈపనులు పూర్తిచేస్తున్నట్టు తెలిసింది. కొన్ని పత్రాల్లో హౌస్‌హోల్డ్ పేరు, వారి తండ్రి లేదా భర్త తదితర వివరాలు రాస్తున్నారు. అలాగే వారి ఫోన్, పోలింగ్ స్టేషన్ నంబర్, ఓటరు జాబితాలో ఉన్న సీరియల్ నంబరు, ఓటరు ఐడీ , వీరు వైసీపీ లేదా టీడీపీకి అనుకూలంగా ఉన్నారా.. లేదా తటస్థంగా ఉన్నారా.. తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నియమించిన సచివాలయ కన్వీనర్ల సహాయంతో వలంటీర్లకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే మండలంలోని 60 శాతానికి పైగా పంచాయతీల్లో సర్వే పూర్తిచేసినట్లు సమాచారం. సర్వే పత్రాలు ఆధారంగా టీడీపీకి అనుకూలంగా ఉన్న ఓటర్లనే లక్ష్యంగా చేసుకుని వారిని ఏ విధంగానైనా వైసీపీ వైపు మరల్చడానికి అనేక ప్రలోభాలను చూపనున్నట్టు తెలుస్తోంది.


మోదకొండమ్మకు భక్తుల పూజలు


చినపాచిల రచ్చబండ వద్ద పంచాంగ శ్రవణంలో గ్రామస్థులు

వైభవంగా తెలుగు సంవత్సరాది వేడుకలు

▸▸ ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణం

చోడవరం, ఏప్రిల్ 9: పట్టణంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలను పూజించారు. పట్టణంలోని ప్రముఖ స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో శ్రీనివాస్. వెంకటరావు, విఘ్నేశ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపారవేత్త ఉప్పల సతీశ్ సహకారంతో ఆలయం వద్ద మజ్జిగపంపిణీ చేశారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో....

పట్టణంలోని లక్ష్మీపురం రోడ్డులోని వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణంతో పాటు, సాంప్రదాయ వస్త్రధారణపోటీలను నిర్వహించి విజేతలకు సీ ఐ బి. శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ నీలం శారద, బ్యూటీషియన్ సుధలు వ్యవహరించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామునుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ప్రతీ ఇంటా మామిడి తోరణాలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని ప్రసాదాన్ని స్వీకరించారు. ఒకరినొకరు కొత్త సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు.

ఊరూరా ఘనంగా పంచాంగ శ్రవణం

రావికమతం: ఉగాది పురస్కరించుకుని గ్రామ గ్రామాన పంచాంగ శ్రవణం నిర్వహించారు. రావికమతం,శివాలయం, కంచిపాటివారి, గంజివారి దేవాలయాలు, చినపాచిల రచ్చబండ (పెద్దరాయి) వద్ద, కొత్తకోట శికేశవ ఆలయం, టి.అర్జాపురం వినాయక ఆలయం, గొంప, మరుపాక, మేడివాడ, దొండపూడి, కొమిర, గుమ్మాళ్లపాడు, గుడిప, తట్టబంద, తోటకూరపాలెం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో పురోహితులు, వేద పండితులు జన్మనక్షత్ర, పేరు బలం, రాశి ఫలాలు పేరు పేరున వివరించారు. వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలు, పశుసంపద ఈ ఏడాది బాగానే ఉంటాయి వివరించారు.చినపాచిల రచ్చబండ వద్ద ఆరవెల్లి వెంకటరామ గోపాలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఏటా పార్టీలు, కుల మతాలకు అతీతంగా గ్రామంతా ఒకే చోట పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

రోలుగుంట: మండలంలోని కొమరవోలు, రోలుగుంట, కుసర్లపూడి, బుచ్చెంపేట, కొవ్వూరు గ్రామాల్లో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

బుచ్చెయ్యపేట: క్రోధి నామ సంవత్సర శుభసందర్భంగా ప్రజలు వడ్డాది గిరిజాంబగిరిపైనున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, బుచ్చెయ్యపేట,విజయరామరాజుపేట, దిబ్బిడి, పెదపమదీన, పొట్టిదొరపాలెం, పి.భీమవరం, గున్నెంపూడి రామాలయాల్లో సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో పంచాంగ శ్రవణం చేశారు. ఈ సంవత్సరంలో పంటలు బాగా పండాలని, సుఖ సౌభాగ్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని కోరుకున్నారు.

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది వేడుకలను నిర్వహించారు. రైతుల తాలూకా పేరుబలాలు, పాడిపంటల సంబంధించి పురోహితులు వివరించారు.

మాడుగుల రూరల్: ఉగాది పండగను మంగళవారం మండలవాసులు ఆనందోత్సాహంతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి పలు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఉగాది పచ్చడిని పలుచోట్ల పంచి పెట్టారు. ఇళ్లలో, ఆలయాల్లో మామిడి తోరణాలు కట్టి అందంగా తీర్చిదిద్దారు. పంచాంగ శ్రవణాన్ని చేపట్టారు.

దేవరాపల్లి: దేవరాపల్లిలో పంచాంగం పురోహితులు చదవి వినిపించారు. నష్టాలు, లాభాలు ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలను వివరించారు. చర్చించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరావు ఈ సందర్భంగా కోరారు. ఎంపీటీసీ కృష్ణమూర్తి పురోహితులు లక్ష్మీపతి శర్మ తదితరులు పాల్గొన్నారు.


పొట్టిదొరపాలెంలో పంచాం శ్రవణం..


దేవరాపల్లి రామాలయంలో..

ఎన్నికల సమయంలో రోడ్డు దుస్థితి గుర్తొచ్చిందా?

▸▸ బీఎన్ రోడ్డుకు అధికార పార్టీ నేతల సొంత నిధులతో మరమ్మతులు

▸▸ అవాక్కవుతున్న స్థానికులు

చోడవరం, ఏప్రిల్ 9: ఐదేళ్లుగా ప్రజల కష్టాలను గాలికి వదిలేసిన అధికార పార్టీ నేతలు, ఎన్నికల ముందు ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు. బీఎన్ రోడ్డు అధ్వాన స్థితికిచేరినా ఇంత కాలం దృష్టిసారించని పాలకులు ఎట్టకేలకు మంగళవారం చోడవరం పట్టణంలోని ప్రధాన రహదారిపై తారుపూతలు వేసే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వెంకన్నపాలెం, గంధవరం నుంచి నియోజకవర్గంలోని రోలుగుంట, వడ్డాది నుంచి మాడుగుల మండలంతాటిపర్తి వరకూగల ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్న సంగతి తెలిసిందే. గత ఐదేళ్లుగా అధికార పార్టీ నేతలు ఈ రోడ్డువైపు కనీసం చూడలేదు. ఈ రహదారి దుస్థితిపై ఈనెల 7న రహదారుణం శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. మరోవైపు స్థానికులనుంచి విమర్శలతో అధికార పార్టీ నేతలలో కలవరం నెలకొంది. ఈ రహదారిని ఇలా వదిలేస్తే ఎన్నికల్లో తమకు ఇబ్బందులు తప్పవని గుర్తించిన అధికార పార్టీ ముఖ్య నాయకులు సొంత ఖర్చుతో రోడ్డును బాగు చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దగ్గరుండి నరసయ్యపేట నుంచి ప్రభుత్వ కళాశాల వరకు తారు రోడ్డు పనులు చేయించారు. కొత్తూరు జంక్షన్‌లో అసం పూర్తిగా వదిలేసిన సిమెంట్ రోడ్డు పనులనూ సోమవారం రాత్రి చేపట్టారు. ఇన్నాళ్లులేనిది ఎన్నికలు వస్తే తప్పా అధికార పార్టీనేతలకు తమ కష్టాలు గుర్తుకు రాలేదని పలువురు సెటైర్లు వేస్తున్నారు. కాగా ఈరోడ్డు పనులు కేవలం చోడవరం పట్టణంలో ని రోడ్డుకే ఈ ప నులు పరిమితం చేస్తారా, లేక బీఎన్ రోడ్డు, వడ్డాది పాడేరు రోడ్డు వరకు పూర్తిచేస్తారా అనే అంశం చర్చనీయాంశంగా మారింది.


నరసయ్యపేట వద్ద తారురోడ్డు వేస్తున్న దృశ్యం

మాడుగుల
నియోజకవర్గం

భానుడు ప్రతాపంతో ప్రజలు బెంబేలు

మాడుగుల, ఏప్రిల్ 9: గత నాలుగైదు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం పది గంటలనుంచే ఎండ ప్రతాపం చూపడంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నారు. ఎండవేడిమి తట్టుకోలేక ప్రజలు, ప్రయాణికులతో పాటు గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్లలో ఫ్యాన్‌లనుంచీ వేడి గాల్పులు రావడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముందురోజులు ఎండతీవ్రత ఉంటుందని ఆందోళన చెందుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

చీడికాడ, ఏప్రిల్ 9: దండిసురవరంలో అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నష్టపరిహారం వెంటనే అందేలా చూడాలని అధికారులను వైసీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ కోరారు. గ్రామంలో అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఆమె వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబుతో కలిసి మంగళవారం ఉదయం బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు వైసీపీ మండల నాయకులు భూసాల రామకృష్ణ, కురచా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


బ్రహ్మంగారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి, ఏప్రిల్ 9: మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం మంగళవారం జరిగింది. ఉద యం నుంచి భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

జనసేనలో చేరికలు

చోడవరం, ఏప్రిల్ 9: మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీలో వైసీపీకి చెందిన నాయకులు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. గ్రామానికి నంబారు నరసింగరావు, పల్లా మూలినాయుడు, సియ్యాద్రి జగదీశ్, గొర్లె సంఘం అధ్యక్షులు నంబారు మూలినాయుడు, ప్రముఖ నాటక కళాకారిణి ఏకుల జగదీశ్వరి, పాలకేంద్రం అధ్యక్షుడు సబ్బి అప్పారావు తదితరులు జనసేనలో చేరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

దేవరాపల్లి: మండలంలోని వాకపల్లికి చెందిన వైసీపీ కార్యకర్తలు పైలా ప్రసాదరావు సమక్షంలో టీడీపీలో మంగళవారం చేరారు. దొగ్గశ్రీరామ్, అ ప్పలనాయుడు, ఎర్నాయుడు, పార్వతీరావు, నారాయణరావు తదితరులు పార్టీలో చేరారు.

విశాఖ నుంచి బ్యాంకాక్ విమానం ప్రారంభం

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి బ్యాంకాక్ వెళ్లేందుకు కొత్త విమాన సర్వీసు మంగళవారం అందుబాటులోకి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ ప్రజలకు కూడా ఇది ఉపయోగపడుతుంది. ఎయిర్ ఆసియా సంస్థ వారానికి మూడు రోజుల సర్వీసును నడపనున్నది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న విమాన సంస్థ ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, వర్మ, విజయమోహన్‌లు మాట్లాడుతూ భారత కాలమానం ప్రకారం విశాఖపట్నంలో రాత్రి 11.50 గంటలకు బయలుదేరి 2.30 గంటలకు బ్యాంకాక్‌లో ల్యాండ్ అవుతుందన్నారు. అక్కడ రాత్రి 7.50 గంటలకు బయలుదేరే విమానం విశాఖలో ఆదేరోజు రాత్రి 11.20 గంటలకు చేరుతుందని వివరించారు. ప్రయాణానికి 2.40 గంటల సమయం పడుతుందన్నారు. ఇది మంగళ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.